# ఇదేం పద్ధతి.. ఇదేం మాఫీ?

## రుణమాఫీ తీరుపై రైతుల ఆగ్రహం | పేర్లు లేకపోవడంతో ఆందోళన.. కలెక్టరేట్లకు అన్నదాత పరుగులు

న్యూస్ నెట్‌వర్క్, జూలై 20 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ గందరగోళంగా మారింది. రూ.లక్షలోపు పంట రుణాలన్నీ మాఫీ చేశామంటూ ప్రభుత్వం గురువారం విడుదల చేసిన జాబితాలో తమ పేర్లు కానరాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. రాష్ట్రంలోని దాదాపు అన్నీ జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. కొన్ని సహకార సంఘాల్లో సగం మందికి, మరికొన్ని చోట్ల 25% మందికి, మరికొన్ని చోట్ల అసలు ఏ ఒక్కరికీ రుణమాఫీ కాకపోవడంతో అసలు ఏం జరుగుతున్నదో అర్థంకాని పరిస్థితి నెలకొన్నది. అన్ని అర్హతలు ఉండీ రుణమాఫీకి నోచుకోని రైతులు వ్యవసాయ పనులన్నీ మానుకొని, వ్యవసాయ అధికారులు, బ్యాంకుల వద్దకు, చివరకు కలెక్టరేట్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. అక్కడ కూడా సరియైన సమాధానం లభించకపోవడంతో 'కొందరికి మాఫీ చేసి, కొందరికి మాఫీ చేయకపోవడం.. ఇదేం పద్ధతి?' అంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో ఇలా ఎప్పుడూ బ్యాంకుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరుగుతూ పైరవీలు చేసుకోవాల్సిన ఖర్మ పట్టలేదని నెత్తిబాదుకుంటున్నారు.



మహబూబాబాద్‌లోని ఓ బ్యాంకులో రుణమాఫీ వివరాలు తెలుసుకుంటున్న రైతులు

### రూ.70 వేలు రుణమే ఉన్నా మాఫీ కాలె

కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్‌కు చెందిన ఎర్ర అంజమ్మకు తెలంగాణ దక్కన్ గ్రామీణ బ్యాంకులో రూ.70 వేలు క్రాప్ లోన్ ఉన్నది. కానీ, రుణమాఫీపై కాంగ్రెస్ సర్కారు విడుదల చేసిన జాబితాలో ఈమె పేరు లేదు. ఎందుకు రాలేదని అధికారులను అడిగితే తమకేమీ తెలియదనే సమాధానం వచ్చింది. దీంతో ఆమె ఆందోళనకు గురవుతున్నది. తాను తీసుకున్న రుణం మాఫీ అవుతుందా? లేదా? అనే మీమాంశలో పడింది. ఇదే అంజమ్మ కరీంనగర్‌లోని కేడీసీసీబీ బ్యాంక్‌లో తీసుకున్న రూ.50 వేల రుణాన్ని గత ప్రభుత్వం వడ్డీతో సహా బ్యాంకుకు చెల్లించింది. గత ప్రభుత్వంలో తాము ఎక్కడికి వెళ్లకున్నా, ఎవరినీ కలవకున్నా, ఎలాంటి పైరవీ లేకుండా తనకు రుణమాఫీ జరిగిందని అంజమ్మ చెప్తున్నారు. ఇప్పుడు వచ్చిన లిస్ట్‌లో తన పేరు లేదని, ఇంకొక లిస్ట్ ఉన్నదని అధికారులు చెప్తున్నారని, అందులోనైనా వస్తుందా? లేదా? అనే విషయంలో స్పష్టత లేదని అంటున్నారు.

**ఉమ్మడి ఆదిలాబాద్‌లో 35శాతం మందికే.**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సగం మందికి కూడా రూ.లక్ష లోపు రుణమాఫీ కాలేదు. జిల్లాలో డీసీసీబీల నుంచి నేరుగా 1,646 మంది, పీఏసీఎస్‌ల నుంచి 33,914 మంది మొత్తంగా 35,560 మంది రైతులు రూ.లక్ష వరకు రుణాలు తీసుకున్నారు. డిసెంబర్ 09, 2023 నాటికి వడ్డీతో కలిపి ఈ రైతులు తీసుకున్న లోన్ మొత్తం రూ.183.21 కోట్లు ఉండగా, తొలి విడత లక్ష వరకు చేసిన రుణమాఫీలో రూ.63.25 కోట్లు మాఫీ అయ్యాయి. అంటే రైతులు తీసుకున్న మొత్తం రుణంలో 34.52 శాతమే మాఫీ అయ్యింది. ఉమ్మడి జిల్లాలో 12,477 మంది రుణాలే మాఫీ అయ్యాయి. అంటే 35% మందికే మాఫీ అయింది. మిగిలిన వారికి ఎందుకు రాలేదు అనే విషయంలో అధికారులకే స్పష్టతలేదు. తలమడుగు మండలంలో గల మహారాష్ట్ర బ్యాంకులో 2,300 మంది బ్యాంకు రుణాలు తీసుకున్నారు. వీరిలో రూ.లక్షలోపు బాకీ ఉన్న రైతులు 382 మంది ఉండగా, 36 మందికి రుణమాఫీ అయింది. మిగతా 346 మందికి అసలు బాకీ కంటే తక్కువ డబ్బులు వారి ఖాతాల్లో జమ అయ్యాయి. దీంతో రైతులు కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవించారు.

**ఖమ్మం డీసీసీబీలో 25% మందికే మాఫీ**

వందేండ్ల చరిత్ర కలిగిన ఖమ్మం డీసీసీబీ రైతులు తొలిసారిగా భారీ నిరాశకు గురయ్యారు. నాలుగు జిల్లాల రైతాంగానికి ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తున్న ఖమ్మం డీసీసీబీకి ప్రభుత్వం రుణమాఫీ నిధుల్లో భారీకోత విధించింది. డీసీసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రసహకార బ్యాంకులో పంట రుణాలు తీసుకున్న రైతులు 1,69,864 మంది ఉన్నారు. పంట రుణమాఫీకి సంబంధించి రూ.908.27 కోట్లు రావాల్సి ఉన్నది. ఖమ్మం జిల్లాలో 1,16,291 మందికిగాను రూ.647.76 కోట్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 47,003 మందికి రూ.235.23 కోట్లు, ములుగు జిల్లాలో 1,375 మంది రైతులకు రూ.6.50 కోట్లు, మహబూబాద్ జిల్లాకు సంబంధించి 5,195 మంది రైతులకు రూ.18.33 కోట్లు అవసరం ఉంటుంది. రూ.లక్షలోపు పంట రుణాలు తీసుకున్న రైతులు 1,43,327 మంది కాగా, వారికి రూ.526 కోట్లను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉన్నది. అయితే 37,625 మంది రైతులకు రూ.121.63 కోట్లను మాత్రమే విడుదల చేశారు. దీంతో 25% మంది రైతులకే రుణమాఫీ వర్తించినట్టయ్యింది.

**జగిత్యాలలో 40% లోపే**

జగిత్యాల జిల్లాలో రూ.లక్ష లోపు పంట రుణాలు ఉన్నవారి సంఖ్య దాదాపు లక్ష మంది ఉండగా, వీరిలో 39 వేల మందికే రుణమాఫీ జరిగింది. దీంతో జిల్లా రైతుల్లో తీవ్ర ఆందోళన, ఆవేదన వ్యక్తమవుతున్నది. బ్యాంకు అధికారులు, వ్యవసాయ అధికారులను రైతులు పెద్ద సంఖ్యలో కలిసి విన్నవిస్తున్నారు. అయితే, మూడు దఫాల్లో రుణమాఫీ ఉంటుందని, మరో దఫాలో వచ్చే అవకాశం ఉన్నదని రైతులకు అధికారులు నచ్చచెప్తున్నారు. మల్యాల మండలం మల్యాల, తక్కళ్లపల్లి సింగిల్ విండో కార్యాలయాల పరిధిలో రుణం తీసుకున్న రైతుల్లో సగం మందికి రుణం మాఫీ కాలేదు. కొందరు రైతుల పేరిట వచ్చిన రుణమాఫీ మొత్తం చూసి సింగిల్ విండో సిబ్బంది, బ్యాంకు అధికారులు, వ్యవసాయ అధికారులు ఆశ్చర్యపోతున్నారు. రూ.లక్షల్లో రుణం ఉంటే వేలల్లో రుణమాఫీ జరిగినట్టు రైతుల పేరిట ప్రకటించడం విస్మయానికి గురి చేస్తున్నది.

**పెద్దూరు సింగిల్‌విండోలో ఒక్కరికీ మాఫీ కాలె**

రాజన్న సిరిసిల్ల జిల్లా పెద్దూరు సింగిల్ విండో పరిధిలోని సహకార బ్యాంకులో 589 మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. ఇందులో 339 మంది రైతులను రుణమాఫీకి అర్హులుగా గుర్తించారు. వీరిలో 279 మంది లక్ష లోపు లోన్ తీసుకున్నవారు ఉన్నారు. తొలి జాబితాలో ఒక్కరికి కూడా రుణమాఫీ కాలేదు. దీంతో వీరందరూ సింగిల్‌విండో, వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. పెద్దూరు సింగిల్‌విండో సిరిసిల్లలోని ఎస్‌బీఐ బ్యాంకుకు అనుసంధానంగా ఉన్నది. ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్‌ను వివరణ కోరగా, తమ పని తాము చేశామని, ప్రభుత్వమే సొసైటీ ఖాతాలో జమ చేయాల్సి ఉన్నదని చెప్పారు. నాబార్డు అధికారిని వివరణ కోరగా ఇంకా తమకు స్పష్టత రాలేదని చెప్పారు.

**నల్లగొండ సహకార రంగంలో 46% మందికే**

ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని డీసీసీబీ ఆధ్వర్యంలో రైతులకు పెద్దమొత్తంలో పంట రుణాలు ఇచ్చారు. రూ.లక్ష వరకు రుణం పొందిన వారిలో 72 వేల మందిని అర్హులుగా గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. వారికి రూ.316 కోట్ల రుణాలు మాఫీ కావాల్సి ఉన్నది. తొలి జాబితా ప్రకారం అర్హులైన వారిలో 46% మందికే రుణమాఫీ వర్తిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. డీసీసీబీ అధికారుల లెక్కల ప్రకారం 33,913 మందికే రూ.143.11 కోట్ల రుణాలు మాఫీ కానున్నాయి. మిగతా 54% మంది పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. గుండాల పీఏసీఎస్‌లో రూ.లక్ష రుణం ఉన్న రైతుల సంఖ్య 1,559 కాగా, మాఫీ అయ్యింది మాత్రం 850 మందికే. వలిగొండ మండలం అర్రూర్ పీఏసీఎస్‌లో 472 మందికి గానూ 297 మందికి మాఫీ వర్తించింది. రామన్నపేట పీఏసీఎస్‌లో 615 మందికిగాను 168 మందికి మాత్రమే మాఫీ అయ్యింది. మోత్కూర్‌లో 778 మందికిగాను 238 మందికి మాత్రమే వచ్చింది. ఆత్మకూర్(ఎం)లో 566 మందికిగాను 239 మందికే మాఫీ వర్తించింది. తుర్కపల్లి పీఏసీఎస్‌లో 822 మందికి గాను 495 మందికే మాఫీ వర్తించింది.

**ఉమ్మడి వరంగల్‌లో సగం మందికి కూడా కాలె**

ఉమ్మడి వరంగల్ డీసీసీబీ పరిధిలో రూ.2 లక్షల వరకు రుణాలు తీసుకున్నవారు 71వేల మంది ఉన్నారు. వీరిలో రూ.లక్ష రుణం తీసుకున్న రైతులు 54,400 మంది కాగా, రుణమాఫీ కింద రూ.249 కోట్ల నిధులు చెల్లించాల్సి ఉన్నది. కానీ, తొలి జాబితాలో సగం మందికి కూడా రుణాలు మాఫీ కాలేదు. రూ.లక్ష రుణమాఫీ కింద కేవలం 23,841 మందికి రూ.106.71 కోట్లు చెల్లించినట్టు బ్యాంకు అధికారులు తెలిపారు. ఇంకా 30,559 మంది రైతులకు రూ.లక్ష లోపు రుణాలు మాఫీ కావాల్సి ఉన్నది. హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండలం పెంచికలపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నుంచి రూ.లక్ష రుణమాఫీకి అర్హులైన రైతులు 549 మంది ఉండగా, ప్రభుత్వం 348 మంది రైతులకే రుణమాఫీ చేసింది.

**వికారాబాద్‌లో ఫిర్యాదుల వెల్లువ**

వికారాబాద్‌లో రైతుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తున్నాయి. పంట రుణాలు మాఫీ అయినట్టు మొబైల్‌ఫోన్‌కు మెసేజ్‌లు రాకపోవడం, అధికారులు విడుదల చేసిన జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రైతులు జిల్లాలోని వ్యవసాయ కార్యాలయాలు, ఏఈవోలు, మండల వ్యవసాయాధికారి కార్యాలయాలకు తరలివస్తున్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్‌రూంకు ఒక్క రోజులోనే 700 ఫోన్ కాల్స్ వచ్చినట్టు సంబంధిత శాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వం రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోవడంతోనే తమ రుణాలు మాఫీ కాలేదని సర్కారు తీరుపై రైతులు మండిపడుతున్నారు. డీసీసీబీ, పీఏసీఎస్ బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతుల్లో కనీసం సగం మందికి కూడా రుణాలు మాఫీ కాలేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

### రుణం రూ.2.25 లక్షలు.. మాఫీ 3,014

జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన నల్ల నర్సింహారెడ్డి 2022 ఆగస్టు 11న మల్యాల సింగిల్ విండో బ్యాంకులో రూ.1.49 లక్షలు రుణం తీసుకున్నాడు. అప్పటి నుంచి వడ్డీ చెల్లిస్తూ వచ్చాడు. నిరుడు ఆగస్టులో కేసీఆర్ ప్రభుత్వం రైతు రుణం మాఫీ చేయగా, నర్సింహారెడ్డికి సంబంధించిన అప్పులో రూ.73,500 మాఫీ అయింది. దీంతో మరో రూ.75,500 అప్పు మిగిలిపోయింది. అయితే నర్సింహారెడ్డి నిరుడు సెప్టెంబర్ 19న మళ్లీ రూ.1.49 లక్షలు లోన్ తీసుకున్నాడు. గతంలో తీసుకున్న రుణంతో కలిపి రూ.2.25 లక్షలు రుణం కలిగి ఉన్నాడు. కాబట్టి, ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం ఆగస్టులో ఆయనకు రుణమాఫీ కావాల్సి ఉన్నది. అయితే ఊహించని విధంగా రూ.లక్షలోపు రుణం ఉన్న వారి తొలి జాబితాలోనే నర్సింహారెడ్డి పేరు రావడంతో సింగిల్ విండో ఉద్యోగులతోపాటు నర్సింహారెడ్డి ఆశ్చర్యపోయారు. నర్సింహారెడ్డి పేరిట రూ.3,014 బాకీ ఉన్నదని, దానిని మాఫీ చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించడంతో బిత్తరపోయారు. రూ.2.25 లక్షల అప్పు ఉంటే, రూ.3 వేలు మాఫీ కావడం ఏమిటి? అసలు తొలి విడతలో తన పేరు ఎందుకు వచ్చిందని మల్యాల సింగిల్ విండో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.



### రుణమాఫీ అయోమయంగా ఉంది

*నేను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పెద్దవంగరలో సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో రుణమాఫీ పొందిన. ఆ తర్వాత మళ్లీ రూ.లక్ష రుణం తీసుకున్నా. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇప్పుడు రెండు లక్షల రుణమాఫీ అంటున్నది. కానీ, నేను తీసుకున్న రూ.లక్ష కూడా నాకు మాఫీ కాలేదు. మాఫీ గురించి నాకు ఎలాంటి మెసేజ్ రాలేదు. దీనిపై ఎవరిని అడగాలో తెలియడం లేదు. అంతా అయోమయంగా ఉన్నది. రుణమాఫీ గురించి అధికారులు స్పష్టత ఇవ్వాలి.*

*-దేశబోయిన రాజు, యువరైతు, కొరిపెల్లి, పెద్దవంగర మండలం, మహబూబాబాద్ జిల్లా*



### రుణమాఫీ కాలే.. రైతుబంధు రాలే

*సీఎం రేవంత్‌రెడ్డి రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తానని జెప్పిండు. నాకు బ్యాంకులో ఉన్నది రూ.82వేల అప్పే. అయినా లోన్ ఎందుకు మాఫీ కాలేదో తెల్వటం లేదు. రుణమాఫీ కాలేదని తలుచుకుంటుంటేనే కండ్లల్లో నీళ్లు తిరుగుతున్నయి. రుణమాఫీ కాకపోతే నేను ఎప్పటికీ లోన్ డబ్బులు కట్టలేను. ఉన్న రెండు ఎకరాల పొలంలో పత్తివేసిన. వర్షాలు లేక పత్తి మొక్కలు లేవనేలేదు. సాగుకు రూ.40వేలకు పైనే ఖర్చు పెట్టినా. కేసీఆర్ సర్కార్ మంచిగుండే. పంట వేయకముందే రైతుబంధు డబ్బులు చేతికివచ్చేటివి. ఆ డబ్బులతో పంట సాగుచేసుకునేటోన్ని. ఇప్పుడు రైతుబంధు డబ్బులు రాలేదు, పంటరుణమాఫీ కాలేదు. రేవంత్‌రెడ్డి సర్కారులో నాలాంటి రైతుల పరిస్థితి ఆగమే ఉంది.*

*-బేగరి మల్కయ్య, రైతు, కొత్లాపూర్, సంగారెడ్డి జిల్లా*



### గరీబులకు కాక ఇంకెవరికి చేస్తరు?

*నాకు 3 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 2018లో ఆసిఫాబాద్ ఎస్‌బీఐ బ్యాంకులో రూ.45 వేల పంట రుణం తీసుకున్న. వడ్డీకట్టి రెన్యూవల్ చేసుకుంటున్న. కానీ రుణమాఫీ లిస్టులో నా పేరు రాలే. శనివారం బ్యాంకుకు వెళ్లి సార్లను అడిగితే రుణమాఫీ కాలేదన్నరు. నాకు రేషన్ కార్డు కూడా ఉంది. అయినా ఎందుకు కాలేదో తెల్వడం లేదు. ఈ కాంగ్రెసోళ్లు మాలాంటి గరీబులకు కాక ఇంకెవ్వరికి చేస్తరో మరి.*

*- రాస్పల్లి కౌసల్య, గుండి, కుమ్రుం ఆసిఫాబాద్ జిల్లా*

# 40 లక్షల మందికి రుణమాఫీ కట్?

- రుణమాఫీలో కాంగ్రెస్ సర్కారు మాయాజాలం
- రైతుల సంఖ్య, నిధులపై ప్రభుత్వ దాపరికం
- చెప్తున్నది 70 లక్షలు.. ఇస్తున్నది 32 లక్షల మందికే

హైదరాబాద్, జూలై 20(నమస్తే తెలంగాణ): రుణమాఫీ అర్హుల సంఖ్యలో సర్కారు భారీ కోత పెట్టింది. బుధవారం రుణమాఫీ కార్యక్రమంలో పాల్గొన్న ఒక అధికారి వద్ద ఉన్న డాక్యుమెంట్ ప్రకారం.. ప్రభుత్వం రుణమాఫీ చేయబోయే రైతుల సంఖ్య 32.50 లక్షల మంది మాత్రమే! ఇందుకు అవసరమయ్యే నిధులు రూ.27 వేల కోట్లు మాత్రమేనని తెలిసింది. దీంతో రుణమాఫీపై ప్రభుత్వం చెప్తున్న లెక్కలు పూర్తిగా అవాస్తవమని తేలిపోయింది.

**40 లక్షల మందికి కోత!**

అధికారుల జాబితా ప్రకారం రూ.2 లక్షల వరకు రుణమాఫీకి 32.50 లక్షల మంది అర్హులని తేల్చగా, 24.4 లక్షల కుటుంబాలకు మాత్రమే వర్తించనున్నది. సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్టుగా ఎలాంటి కోతలు విధించకుండా, పాస్‌పుస్తకాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకుంటే, 70 లక్షల రుణఖాతా కలిగిన రైతులకు ఎంతోకొంత రుణం మాఫీ కావాలి. కానీ, సుమారు 32.5 లక్షల నుంచి 37.5 లక్షల మందికి కోత పెడుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ లెక్కన ప్రభుత్వం 45% మందికి మాత్రమే రుణమాఫీ చేస్తుండగా, 55% మందికి మొండిచెయ్యి చూపిస్తున్నది.



### మార్పు ఇదేనా..?

*నాకు 1.21 ఎకరాల భూమి ఉన్నది. బ్యాంక్‌లో నా పేరు మీద రూ.65 వేలు పంట రుణం తీసుకున్నా. ఈ రోజు వరకు నాకు పైసలు పడలేదు. బ్యాంక్‌కు వెళ్లి అడిగితే నీ పేరు లిస్టులో లేదన్నారు. ఏఓ దగ్గరకు వెళ్లి అడిగితే ఆధార్ కార్డు నంబర్‌తో ఆన్‌లైన్‌లో చూసి మీ లోన్ మాఫీ అండర్ ప్రాసెస్ అని ఉన్నట్టు చెప్పారు. ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని గొప్పలు పోయిన సర్కారు ఇప్పటికే రూ.లక్ష వరకు అందరికీ మాఫీ అయిందని చెబుతున్నది. మరి నా లోన్ ఎందుకు మాఫీ కాలేదు? కాంగ్రెస్ మార్పు అంటే ఇదేనా?*

*- మామిడి సుశీలమ్మ, కోతులబాద, పాలకుర్తి నియోజకవర్గం, జనగామ జిల్లా*

**31వేల కోట్లు కాదు... 27వేల కోట్లే!**

రుణమాఫీకి రూ.31 వేల కోట్లు అవసరమని ప్రభుత్వం చెప్తున్నది. కానీ, డాక్యుమెంట్ ప్రకారం రూ.28 వేల కోట్లతో రుణమాఫీ పూర్తి చేయనున్నట్టు తెలిసింది. రుణమాఫీని నాలుగు స్లాబ్‌లుగా విభజించి తొలి మూడు స్లాబ్‌లకు రూ.6 వేల కోట్ల చొప్పున కేటాయించి, చివరి స్లాబ్‌లో రూ.9 వేల కోట్లు కేటాయించింది. ఈ లెక్కన నాలుగు స్లాబ్‌లకు కలిపి ఇస్తున్నది రూ.27 వేల కోట్లే. ప్రతి స్లాబ్‌లో ఆర్జీలు, తప్పొప్పులు, వాటి పరిష్కారానికి సంబంధించి రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తున్నట్టు పేర్కొన్నది. కానీ, ఈ పరిస్థితి రాదనే అభిప్రాయాలను అధికారులు వ్యక్తంచేస్తున్నారు. జాబితాలో ఉన్న రైతులకు సమస్య ఎదురైతే అప్పటికే కేటాయించిన నిధుల నుంచే ఆ సమస్య పరిష్కారమవుతుందని, అదనపు నిధులతో అవసరం లేదని చెప్తున్నారు. ఒకసారి జాబితాలో లేని రైతులకు రుణమాఫీ కావడం దాదాపు అసాధ్యమంటున్నారు. అలాంటప్పుడు అదనంగా కేటాయించిన నిధులు పేరుకే తప్ప వాటిని వాడేది లేదని చెప్తున్నారు. దీని ప్రకారం రూ.2 లక్షల రుణమాఫీపై ప్రభుత్వం చెప్తున్నట్టుగా రూ.31 వేల కోట్లతో కాకుండా రూ.27 వేల కోట్లతోనే సరిపెట్టే అవకాశం ఉన్నది.

**లక్ష వరకు 35 లక్షలు.. 2 లక్షల వరకు 32 లక్షల మంది రైతులు**

రుణమాఫీ అర్హుల సంఖ్యలో తేడా కనిపిస్తున్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2014లో రూ.లక్ష వరకు రుణమాఫీ చేసింది. అప్పుడు 35.31 లక్షల మందికి రుణ మాఫీ అయింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తున్నప్పటికీ, అర్హుల సంఖ్య 32.5 లక్షలుగానే ఉండటం అనుమానాలు రేకెత్తిస్తున్నది. మంత్రి తుమ్మల చెప్పిన లెక్క ప్రకారం 44 లక్షల మంది రైతులు ఉన్నారనుకుంటే, బీఆర్‌ఎస్‌తో పోల్చితే 8.69 లక్షల మంది రైతులు మాత్రమే అదనంగా ఉన్నారు. బీఆర్‌ఎస్ సర్కారు రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తే 35.31 లక్షల మందికి లబ్ధి చేకూరగా, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తే 32.5 లక్షల మందికే లబ్ధి చేకూరుతుండటం అనుమానాలకు తావిస్తున్నది.

**రేషన్‌కార్డు లేనివారికి, ప్రభుత్వ ఉద్యోగులకు మొండిచెయ్యి**

ఎలాంటి కోతలు లేకుండా పాస్‌పుస్తకం అధారంగానే రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం తెరవెనుక అడ్డదిడ్డంగా కోతలు పెడుతున్నది. రేషన్‌కార్డు లేని వారికి, ప్రభుత్వ ఉద్యోగులకు మాఫీ చేయడం లేదు. గురువారం రూ.లక్ష వరకు రుణం మాఫీ చేయగా రేషన్‌కార్డు లేని రైతు కుటుంబాలకు, ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు మాఫీ కాలేదు. ఈ కుటుంబాల రైతులు ఏఈవోల వద్దకు వెళ్లి ఆరా తీయగా వాళ్ల ఆధార్ నంబర్‌తో పరిశీలిస్తే.. రేషన్‌కార్డు లేదని, కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారంటూ చూపిస్తున్నది. ఈవిధంగా ప్రభుత్వం కోతలు లేవంటూనే అర్హుల సంఖ్యను కుదిస్తున్నది.

### రుణమాఫీ లెక్కలపై తలో మాట... మారుతున్న లెక్కలు


రుణమాఫీకి అర్హులయ్యే రైతుల సంఖ్య, కుటుంబాల సంఖ్యపై స్పష్టత లేకుండా పోయింది. దీనిపై ప్రభుత్వం అధికారిక వివరాలను వెల్లడించకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. దీనికితోడు రైతుల సంఖ్య, కుటుంబాల సంఖ్యపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తలో మాట మాట్లాడుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి 70 లక్షల రుణ ఖాతాలు ఉన్నాయని చెప్తుండగా, మంత్రి తుమ్మల మాత్రం 60 లక్షల రుణ ఖాతాలున్నాయని ఒకసారి, 44 లక్షల రుణ ఖాతాలు మాత్రమే ఉన్నాయని మరోసారి చెప్పడం గమనార్హం. కుటుంబాల సంఖ్యను తొలుత 39 లక్షలని చెప్పిన మంత్రి తుమ్మల తాజాగా 25 లక్షలు మాత్రమేనని చెప్తున్నారు. ఈ విధంగా ఒక్కొక్కరు ఒక్కోవిధంగా ఒక్కో లెక్క వెల్లడిస్తూ గందరగోళం సృష్టిస్తున్నారు. రోజురోజుకి రుణమాఫీకి అర్హులయ్యే రైతుల సంఖ్య, కుటుంబాల సంఖ్య తగ్గుతుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



### రైతు భరోసా నిధులు రుణమాఫీకి మళ్లింపు

మాజీ మంత్రి కొప్పుల

జగిత్యాల, జూలై 20 : కాంగ్రెస్ సర్కార్ యాసంగి, వానకాలంలో చెల్లించాల్సిన రైతు భరోసా సొమ్ము ఎగ్గొట్టి.. రుణమాఫీకి మళ్లించిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. రుణమాఫీలోనూ కోతపెట్టి రైతులను మోసం చేసిందని, పంట నష్టపరిహారం ఇవ్వకుండా అన్నదాతలను గోస పెడుతున్నదని విమర్శించారు. శనివారం ఆయన జగిత్యాలలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు రుణమాఫీ చేసినట్టు పత్రికా ప్రకటనలకే కోట్లు ఖర్చు చేసిందని విమర్శించారు. యాసంగి, వానకాలంలో రైతు భరోసా కింద రైతులకు, కౌలు రైతులకు రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేలు ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. ఈ సొమ్ము రూ.20 వేల కోట్లకుపైనే ఉంటుందని, దానిని ఎగ్గొట్టి కొంత రుణ మాఫీకి మళ్లించిందని చెప్పారు.



### షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్


మఠంపల్లి, జూలై 20 : కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని పెదవీడులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వంలో రెండు దఫాలుగా రూ.31వేల కోట్ల రుణమాఫీ జరిగితే, కాంగ్రెస్ ప్రభుత్వం 6వేల కోట్లే మాఫీచేసి సంబురాలు చేయడం విడ్డూరంగా ఉన్నదని మండిపడ్డారు. జీఓ నెం.46 ప్రకారం ఉద్యోగం పొందిన కానిస్టేబుళ్లను తక్షణమే విధుల్లో తీసుకోవాలని డిమాండ్ చేశారు.



### మూడు రోజులుగా ఎదురుచూస్తున్నం..

*నేను పెద్దూరు సొసైటీ ద్వారా రూ.90 వేలు రుణం తీసుకున్న. రుణమాఫీ కింద లక్ష మాఫీ చేస్తమన్నరు. 18న ఖాతాలో జమైతయన్నరు. 19న ఖాతా చెక్ చేయిస్తే రుణమాఫీ పైసలు పడలేదు. బ్యాంక్ అధికారులను అడిగిన వస్తయి అంటున్నరు. మూడు రోజులుగా ఇట్లనే చెబుతున్నరు. అధికారులు రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలె.*

*- భూక్య తిరుపతినాయక్, రైతు, పెద్దూరు, రాజన్న సిరిసిల్ల*



### 60% మందికి మాఫీ కాలేదు

*గీసుగొండ రైతు సహకార సంఘంలో గతేడాది రూ.30 వేల రుణం తీసుకున్న. మాఫీ అవుతుందని ఆశించినా లిస్టులో నాపేరు రాలేదు. వ్యవసాయ శాఖ, సొసైటీ అధికారులను అడిగితే మాకేం తెలియదని, లిస్టులో ఉన్న వారికే మాఫీ వర్తిస్తుందని చెప్తున్నారు. గవర్నమెంట్ నుంచి ఎలాంటి సమాచారం లేదంటున్నారు. లక్ష లోపు అందరికీ మాఫీ చేస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. వందకు 60 మందికి మాఫీ కాలేదు.*

*-దర్శనాల కుమారస్వామి, వరంగల్ జిల్లా*

# బ్యాంకుల్లో పొరపాట్లు.. ఆధార్‌లో తప్పులు

### 3 లక్షల ఖాతాలకు రుణమాఫీ అసాధ్యం

**తప్పులు సరి చేశాక అర్హులకు మాఫీ.. క్లియర్ టైటిల్ ఖాతాలెన్నో ఇంకా తెలియదు**

**ఆగస్టులో రుణమాఫీ చేయకపోతే ఉరేయండి.. రైతుబంధుకు డబ్బు లు మూటకట్టలేదు**

**విధి విధానాలు ఖరారు అయ్యాకే రైతుభరోసా.. మీడియాతో మంత్రి తుమ్మల**

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీ ఖాతాల్లో బ్యాంకులు తప్పులు చేశాయని, ఇప్పటివరకు ఆరు కో-ఆపరేటివ్ బ్యాంకుల్లో రెండువేల వరకు తప్పుడు ఖాతాలను గుర్తించామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దాదాపు 3 లక్షల రుణ ఖాతాలకు సంబంధించిన రైతుల ఆధార్‌కార్డుల్లో పొరపాట్లు ఉన్నాయని, వారికి రుణమాఫీ చేయడం సాధ్యం కాదని చెప్పారు. వీరంతా ఆధార్‌కార్డుల్లో మార్పులు చేసుకుని, దానిని స్థానిక అధికారులకు సమర్పించి అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. ఆ తర్వాత అర్హులైనవారికి రుణమాఫీ అవుతుందని స్పష్టంచేశారు. శనివారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. రుణమాఫీ కోసం నిర్ణయించిన కటాఫ్ తేదీ కంటే ముందు రుణాలు తీసుకున్న ఖాతాలను కూడా కొన్ని బ్యాంకులు జాబితాలో చేర్చిన విషయాన్ని గుర్తించినట్టు తెలిపారు. ఈ విధంగా ఒకే బ్యాంకులో ఒకేసారి 500 తప్పుడు ఖాతాలను జాబితాలో చేర్చారని వెల్లడించారు. ఇలాంటి వాటిపై ఆడిట్‌తోపాటు విచారణ కూడా జరుగుతున్నదని తెలిపారు. ఉద్దేశపూర్వకంగా తప్పులు చేసిన బ్యాంకులు లేదా బ్యాంకు అధికారులపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. రైతు రుణఖాతాలు 44 లక్షలుగా ఉన్న ట్టు గుర్తించామని, వాస్తవంగా ఇప్పటికే 39 లక్షల ఖాతాలున్నాయని పేర్కొన్నారు. ఆధార్‌లో తప్పులు, పేర్లలో తప్పులు, రేషన్‌కార్డు.. ఇలా రకరకాల కారణాలతో తప్పులు ఉన్నవి ఎన్నో గుర్తించాల్సి ఉన్నదని, పూర్తవడానికి మరో నెల సమయం పట్టే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. వచ్చే ఆగస్టులోనే 44 లక్ష ల ఖాతాదారులకు మొత్తం రుణమాఫీ చేస్తామని, ఒకవేళ రుణమాఫీ జరుగకపోతే ఉరేయాలని సవాల్ చేశారు.

**డబ్బులు మూటకట్టి పెట్టలేదు..**

రుణమాఫీలో సమస్యల పరిష్కారానికి స్థానికంగా అగ్రికల్చర్ అధికారిని సంప్రదించాలని మంత్రి తుమ్మల సూచించారు. ఇన్‌కంట్యాక్స్ చెల్లించేవారు రుణమాఫీ పరిధిలోకి రారని స్పష్టంచేశారు. రైతుభరోసా కోసం డబ్బులు మూటకట్టి పెట్టలేదని వ్యంగ్యంగా మాట్లాడారు. విధి విధానాల ఖరారు తర్వాత రైతు భరోసా అమలుచేస్తామని చెప్పారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, ఇంకా నాలుగున్నరేండ్లు అధికారంలో ఉంటామని, ఈ పథకం అమలు చేయకపోతే నిలదీయాలని సవాల్ చేశారు. ప్రభుత్వ ఆదాయం ప్రకారం రుణమాఫీ జరుగుతుందని తేల్చిచెప్పారు.

### కాంగ్రెస్ ప్రతి స్కీమ్‌లో ఓ స్కామ్

బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి స్కీమ్‌లో ఏదో ఒక స్కామ్ ఉన్నదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన అసెంబ్లీ మీడియా హాల్‌లో మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానిది ప్రజాపాలన కాదని, ప్రజావ్యతిరేక పాలన అని విమర్శించారు. రుణమాఫీ పేరుతో ప్రభుత్వం రైతులను మరోసారి మోసం చేసిందని మండిపడ్డారు.